సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024




బొజ్జ గణపయ్య.. వెళ్లిరావయ్య

బై బై గణేశా.. అంటూ బొజ్జగణపయ్యల నిమజ్జనాలు అట్టహాసంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా నవరాత్రుల సందడి నెలకొంది. 8లో



'నులి'మేద్దాం

జాతీయ నులిపురుగుల నివారణ వారోత్స వాల్లో భాగంగా ఆల్‌బెండాజోల్ మాత్రల పంపిణీకి వైద్యారోగ్యశాఖ చర్యలు చేపట్టింది. 8లో



బైక్ దొంగల అరెస్ట్

మోటార్‌సైకిళ్లు, కోళ్లను దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు నిందితులను పెంటపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి 'స్వచ్ఛతా హీ సేవ'



కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మంగళవారం నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత నినాదంతో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. స్వచ్ఛతాహీ భాగీదరిలో భాగంగా తల్లి పేరుతో ఒక మొక్కను నాటడం, మెప్మా, డ్వాక్రా, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్థానికంగా స్వచ్ఛతా కార్యక్రమాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మూడు రకాలుగా మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, నియోజకవర్గ పరిధిలో కార్యక్రమాలు పక్కాగా జరిగేలా అధికారులు చూడాలన్నారు. వచ్చే నెల 2న స్వచ్ఛభారత్ దివస్ ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు.

వైద్య విద్యను దూరం చేసే కుట్ర



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్ : పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే విధంగా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మెడికల్ బోర్డు మంజూరు చేసిన ఎంబీబీఎస్ సీట్లను తమకు అవసరం లేదని సీఎం చంద్రబాబు లేఖ రాయడం తీరు చూస్తుంటే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టినట్లు స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను నిలుపుదల చేస్తూ వాటిని ప్రైవేట్‌పరం చేయడానికి ప్రయత్నించడం విచారకరమన్నా రు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దూరం చేస్తున్నారని వినిస్టన్‌బాబు ఆరోపించారు.

వక్ఫ్ బోర్డు బిల్లును వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర జమాత్ ఇస్లామీ హింద్ అధ్యక్షుడు రఫీక్

చింతలపూడి : మహమ్మద్ ప్రవక్త సమస్త మానవాళికి మార్గదర్శకులు అని రాష్ట్ర జమాత్ ఇస్లామీ హింద్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ అన్నారు. సోమవారం చింతలపూడి జామియ మస్జిద్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు చేయడానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమించిందని, ఇది కేవలం మతపరమైన రాజకీయం కోసం చేస్తున్న ప్రయత్నమన్నారు. వక్ఫ్ ఆస్తులను కాపాడటం కోసం వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేశారని, వక్ఫ్ ఆస్తులు అంటే పూర్వీకులు సంపాదించిన స్థలాలు, పొలాలు ఉంటాయన్నారు. ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి అజమాయిషీ లేదన్నారు. ఇప్పటికే 70 శాతం వక్ఫ్ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును ముస్లింలతో పాటు ఇతర మతాల వారు వ్యతిరేకించాలని కోరారు. విజయవాడ వరద బాధితులకు రాష్ట్ర జమాత్ ఇస్లామీ, ఐవైయం, ఎస్ఐఓ తరఫున సహాయం చేశామన్నారు. జామియా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రహీం , ప్రధాన కార్యదర్శి ఎండీ జిలానీ పాల్గొన్నారు.

జానీ మాస్టర్ అవార్డును రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న కట్టా ఏసుబాబు

దెందులూరు: జనసేన నేత, డ్యాన్స్ మాస్టర్ జానీకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డును వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు డిమాండ్ చేశారు. సోమవారం దెందులూరులో నల్ల బ్యాడ్జీతో ఆయన నేలపై కూర్చుని నిరసన తెలిపారు. జానీ మాస్టర్‌పై అత్యాచారయత్నం కేసు నమోదైందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, హోం మంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. మహిళల గురించి జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎన్నో స్పీచ్‌లు ఇస్తారని ఇలాంటి సందర్భాల్లో స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. మహిళలందరికీ ఒకే న్యాయం.. జనసేన లక్ష్యం కాదా అని విమర్శించారు.

ఈవీలపై బాదుడు

పర్యావరణహితులకు షాక్


- వాహనదారులపై కూటమి పోటు
- ఎలక్ట్రిక్ వాహనాలపై 12 శాతం పన్నుకు ఆదేశాలు
- వాహనాలపై రూ.8,400 నుంచి రూ.3 లక్షల వరకు భారం
- ఉమ్మడి జిల్లాలో అమ్మకాలపై ప్రభావం
- పన్ను మినహాయింపు ఇచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



సాక్షి, భీమవరం: ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) కొనుగోలుదారులకు కూటమి సర్కారు షాకిచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన పన్ను మినహాయింపును ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఎత్తివేసింది. 12 శాతం పన్ను రూపంలో వాహన ధరలను అమాంతం పెంచేయడంతో వీటి కొనుగోలుకు సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాల ద్వారా వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. పొగ కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు ఇంధనం ఆదాలో ఎలక్ట్రిక్ వాహనాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే వీటి ధరలు కాస్త ఎక్కువగానే ఉంటాయి. ఆయా కంపెనీలు, సీటింగ్ కెపాసిటీ, ఇతర ఫీచర్లను బట్టి కారులు సుమారు రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలు, టూ వీలర్లు రూ.70 వేల నుంచి రూ.1.70 లక్షలు వరకు ఉన్నా యి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గత ప్రభు త్వం వాటిపై జీరో ట్యాక్స్ విధానం అమల్లోకి తెచ్చి పన్ను భారం లేకుండా చేసింది. దీని వలన ప్రభు త్వ ఆదాయానికి గండి పడుతున్నా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించే లక్ష్యంతో పన్ను రా యితీని కొనసాగిస్తూ వచ్చింది. ప్రభుత్వం ఆశించి న ట్టుగానే వీటి అమ్మకాలు పెరుగుతూ వస్తున్నా యి. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, త ణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, ఏలూరు జిల్లా పరిధిలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం రవాణా శాఖ కార్యాలయాల్లో ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల్లో ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగేవి. కోవిడ్ మహమ్మారి వచ్చిన 2020, 2021తో పోలిస్తే తర్వాత మూడేళ్లలో వీటి వినియోగం బాగా పెరిగింది.

అమ్మకాలపై ప్రభావం

ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న తరుణంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నిర్ణయం శరాఘాతంలా పరిణమించింది. ఈ ఏడాది జూలై నాటికి రికార్డు స్థాయిలో ఈవీల రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం. గత రెండేళ్లుగా ఏడాదికి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆయా రవాణశాఖ కార్యాలయాల్లో మొత్తం 1,800కు పైగా ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు జరగ్గా ఈ ఏడాది ఆరు నెలల్లోనే 1,600 పైగా రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సమాచారం. ధరలు భారీగా పెరగడంతో గత నెలన్నర రోజులుగా వీటి అమ్మకాలు గణనీయంగా పడిపోయినట్టు తెలుస్తోంది. జిల్లాలో 10 వరకు షోరూమ్‌లు ఉండగా నెలకు 130 నుంచి 150 వరకు వాహనాల అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు వాటి సంఖ్య 30 నుంచి 40కు తగ్గినట్టు వినియోగదారులు అంటున్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు సూపర్‌సిక్స్ అంటూ ఊదరగొట్టి గద్దెనెక్కాక వాటి ఊసెత్తకపోగా వచ్చీరాగానే ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రూపంలో భారం మోపారని వినియోగదారులు విమర్శిస్తున్నారు. అలాగే ఏలూరు జిల్లాలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెంలోని రవాణా శాఖ కార్యాలయాల్లో ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు గత ఐదు సంవత్సరాలుగా పెరుగుతూ వచ్చాయి. ఈ ఏడాది ఆరు నెలల కాలానికి 1,200లకు పైగా రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సమాచారం.



జీరో ట్యాక్స్ విధానాన్ని ఎత్తేసి..

ఎలక్ట్రిక్ వాహనాలపై జీరో టాక్స్ రాయితీ గడువు జూలై 7తో ముగిసింది. గత జగన్ ప్రభుత్వం మాదిరి కూటమి ప్రభుత్వం రాయితీని కొనసాగిస్తుందని కొనుగోలుదారులు భావించారు. కాగా వారి ఆశలపై నీళ్ల చల్లుతూ జీరో ట్యాక్స్ విధానాన్ని సీఎం చంద్రబాబు ఎత్తేయడంతో వాటి ధరలకు రెక్కలొచ్చాయి. ఆయా మోటారు సైకిళ్లు, కార్లపై రూ.8,400లు నుంచి రూ.3 లక్షల వరకు ధరలు అదనంగా పెరిగిపోవడంతో వాటిని కొనుగోలు చేసేందుకు కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారు. ఎలక్ట్రిక్ టూ వీలర్స్ కొనుగోలు చేద్దామన్న సామాన్యులకు ప్రస్తుతం పెరిగిన ధరలు ఆశనిపాతంలా తయారయ్యాయి.

పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో రిజిస్ట్రేషన్లు

(భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు కార్యాలయాలు)

సంవత్సరం	మొత్తం వాహనాలు	ఎలక్ట్రిక్ వాహనాలు
2020	41,655	175
2021	40,478	696
2022	32,917	1,801
2023	31,645	1,843
2024	23,311	1,817

ఏలూరు జిల్లా పరిధిలో రిజిస్ట్రేషన్లు

(ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం కార్యాలయాలు)

సంవత్సరం	మొత్తం వాహనాలు	ఎలక్ట్రిక్ వాహనాలు
2020	45,116	54
2021	42,556	245
2022	37,685	987
2023	38,714	1,050
2024	25,885	1,279

● తగ్గిన వడి.. విగ్రహాలు బయటపడి



నిన్నమొన్నటి వరకూ పరవళ్లు తొక్కుతూ ప్రవహించిన గోదారమ్మ శాంతించింది. నదిలో ప్రవాహ వేగం తగ్గింది. గణపతి నవరాత్రుల సందర్భంగా ఆదివారం గోదావరిలో నిమజ్జనాలు చేసిన విగ్రహాలు నీరు తగ్గడంతో సోమవారం ఇలా బయటపడ్డాయి. నరసాపురంలోని వలంధర్ రేవులో కనిపించిన దృశ్యమిది.

– నరసాపురం

సోలార్‌పై చిన్నచూపు

- మూతపడ్డ విద్యుత్ కేంద్రం
- నాలుగు నెలలుగా ఉత్పత్తికి నోచుకోని వైనం
- కాలువపై సోలార్ ప్యానల్స్ దీని ప్రత్యేకం

భీమవరం: పర్యావరణహితమైన సోలార్ విద్యుత్‌తో ఖర్చు తగ్గించుకోవచ్చంటూ కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయల వ్యయంతో భీమవరంలో ఏర్పాటుచేసిన సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ నిరుపయోగంగా మారింది. నాలుగు నెలలుగా విద్యుత్ ఉత్పత్తికి నోచుకోక మూలన పడింది. కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకంలో పెద్ద ఎత్తున సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. వినియోగదారులకు సబ్సిడీలూ అందిస్తోంది.

రూ.7.5 కోట్ల వ్యయంతో..

దాదాపు 9 ఏళ్ల క్రితం సోలార్ విద్యుత్ ఆవశ్యకతను గుర్తించి సుమారు రూ.7.5 కోట్ల ఖర్చుతో భీమవరం పట్టణం వద్ద నుంచి ప్రవహించే లోసరి మెయిన్ కాలువపై సుమారు కిలోమీటరు పొడవునా సోలార్ ప్యానల్స్ అమర్చి విద్యుత్ ఉత్పతికి శ్రీకారం చుట్టారు. డెల్టా ప్రాంతంలో ఖాళీ ప్రదేశాలు దొరకడం కష్టతరమని భావించి కాలువపై ప్లేట్స్ అమర్చి మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాట్లు చేశారు. దక్షిణ భారతదేశంలోనే ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌గా ఇది గుర్తింపు పొందింది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ సబ్‌స్టేషన్ గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు సమయంలో గొల్లవానితిప్ప పరిసరాల్లోని నాలుగు గ్రామాలకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేయవచ్చునని అంచనా వేశారు. ఇప్పటివరకు సవ్యంగా పనిచేసిన విద్యుత్ ప్లాంట్ నాలుగు నెలలుగా మూతపడినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.



భీమవరం-లోసరి కాలువపై సోలార్ ప్యానల్స్

కేంద్ర మంత్రి ఉన్నా.. పట్టించుకోవడం లేదేంటన్నా..

భీమవరంలోనే కూటమికి చెందిన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఉంటున్నా సోలార్ విద్యుత్ ప్లాంట్ బాగోగులను పట్టించుకోకపోవడం దారుణమని ప్రజలు విమర్శిస్తున్నారు. సోలార్ విద్యుత్ వాడడంటూ ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంటే ఇప్పటికే ఏర్పాటుచేసిన విద్యుత్ ప్లాంట్‌ను పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో ఏర్పాటుచేసిన ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సోలార్ విద్యుత్ కేంద్ర భవనం

నేటి నుంచి వైద్య సేవలు బంద్

ఏలూరు టౌన్: రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం నుంచి వైద్య సేవలు నిలిపివేస్తున్నామని ఏపీ ప్రాథమిక వైద్య కేంద్రాల వైద్యుల అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ జ్యోత్స్న, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.పూర్ణచంద్రకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విజయవాడ ధర్నాచౌక్‌లో శాంతియుత విధానంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85కు వ్యతిరేకంగా ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ చేపట్టే పోరాటానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. రాష్ట్ర అసోసియేషన్ బృందం ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలీకృతం కాలే దని, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేసేందుకు సరైన రీతిలో స్పందించలేదని తెలిపారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఆందోళన మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

నీళ్లలోనే ఊళ్లు

వరద.. బెడద

- ఆక్రమణలతోనే కొల్లేరు గ్రామాల్లో ముంపు
- కుచించుకుపోయిన సరస్సు
- చెరువులు, రోడ్డు నిర్మాణాలతో ముప్పు
- వరదలతో 10 వేల ఎకరాల్లో ఆక్వా చెరువులకు నష్టం

కై కలూరు: రెండు తెలుగు రాష్ట్రాల్లో రామ్‌సార్ సదస్సు గుర్తించిన ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు. ఇక్కడ నేల చేపల పెంపకానికి అనుకూలంగా ఉంటుంది. దీంతో ఇక్కడ విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, విశాఖ వంటి ప్రాంతాల నుంచి బడాబాబులు లీజుల పేరులో లక్షలాది ఎకరాల అక్రమ చేపల సాగును చేపట్టారు. పర్యావరణ ప్రేమికులు సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం వేయడంతో 1999లో కొల్లేరు 5వ కాంటూరు వరకు 77,138 ఎకరాలను అభయారణ్యంగా ప్రభుత్వం ప్రకటించింది. కొల్లేరు ఆపరేషన్ పేరుతో 2006లో అభయారణ్యంలో అడ్డగోలుగా నిర్మించిన 25,142 ఎకరాల విస్తీర్ణంలో అక్రమిత చేపల చెరువులను ధ్వంసం చేశారు.

డ్రెయిన్లు పూడుకుని.. నీరు ఎగదన్ని..

బుడమేరు, రామిలేరు తమ్మిలేరు, చంద్రయ్య డ్రెయిన్, ఎర్రకాల్వ వంటి 67 డ్రెయిన్లు, కాల్వల ద్వారా వరదల సమయంలో కొల్లేరుకు 1.10 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుంది. ఈ నీరంతా మండవల్లి మండలం పెద ఎడ్లగాడి వంతెన నుంచి ఉప్పుటేరు మీదుగా చినగొల్లపాలెం సమీపంలో సముద్రంలో కలుస్తుంది. అసలు సమస్య ఇక్కడే మొదలవుతోంది. పెదఎడ్లగాడి వంతెన నుంచి సర్కారు కాల్వ వరకు 18 కిలోమీటర్ల మధ్య అక్రమ చెరువులను విపరీతంగా తవ్వేశారు. అలాగే గుడివాకలంక-యాగనమిల్లి నుంచి కొవ్వాడలంక వరకు ఆక్రమిత చేపల చెరువులకు మేతలు తరలించడానికి ఏకంగా రోడ్డును కూడా నిర్మించారు. దీంతో డ్రెయిన్లు పూడుకపోయాయి. నీరు ఎగదన్ని కొల్లేరులంక గ్రామాలు మొత్తం మునిగాయి.

మరో వారమైనా తగ్గేనా..

ముంపు నీరు మరో వారం రోజుల కైనా తగ్గుతుందా.. లేదా అనే అనుమానం కలుగుతోంది. పెదఎడ్లగాడి వంతెన వద్ద నీటిమట్టం నాలుగు రోజుల ముందు 3.45 మీటర్లు ఉండగా ఉప్పుటేరు వద్ద డిశ్చార్జ్ కెపాసిటీ 2 మీటర్లు కూడా లేదు. అంటే ఎగువ నుంచి వస్తున్న వరద నీరు అక్రమ చెరువులు, చెరువులకు పడిన గండ్లతో ముందుకు పారడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా కొల్లేరులో ఆక్రమణలను హైదరాబాద్ హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేసి తొలగించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.



ప్రమాదకర వడిలో పడవపై పెనుమాకలంక గ్రామం చేరుతున్న గ్రామస్తులు



పెనుమాకలంక-నందిగాలమలంక రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

పక్షం రోజులుగా ముంపు ముంగిట్లోనే..

కొల్లేరులో వరద కారణంగా 15 రోజులుగా లంక గ్రామాలు నీళ్లలో నానుతున్నాయి. మండవల్లి మండలం పెనుమాకలంక-నందిగామలంక రోడ్డు పూర్తిగా మునగడంతో ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే మణుగునూరు, శ్రీరామ్‌నగర్, కొవ్వాలంక, నుచ్చిమిల్లి, చింతపాడు, పులపర్రు, సుబ్బారావుపేట వంటి గ్రామాలను ఇప్పటికీ నీరు చుట్టుముట్టే ఉంది. కై కలూరు మండలంలో నత్తగుళ్లపాడు, చటాకాయి, పంచికలమర్రు, కొట్టాడ, పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు, కొల్లేటికోట, గోకర్ణపురం గ్రామాల్లో ముంపు నీరు తగ్గలేదు. ముంపు నీరు కిందకు పారకపోవడానికి అక్రమ చెరువులే కారణమని పలువురు అంటున్నారు.

సుమారు రూ.300 కోట్ల నష్టం

చేపల చెరువుల గట్లు తెగి కై కలూరు, మండవల్లి, నందివాడ, ఏలూరు రూరల్, ఆకివీడు, దెందులూరు, పెదపాడు వంటి మండలంలో సుమారు 10 వేల ఎకరాల చేపల చెరువులకు గండ్లు పడి రూ.300 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ నష్టం మరింతగా పెరిగే అవకాశం ఉంది. వాస్తవానికి 10 వేల ఎకరాల్లో సుమారు 7 వేల ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా కొల్లేరు సాగు చెరువులే ఉన్నాయి. రాజకీయ నాయకులు అండదండలు, కొల్లేరు ఓట్లు రాజకీయం కారణంగా వరదల సమయంలో ఆక్రమణల అంశాన్ని పక్కదారి పట్టించడానికి గుర్రపుడెక్క అంశాన్ని రాజకీయ నేతలు తెరపైకి తీసుకొస్తున్నారు.

తిలాపాపం తలాపిడికెడు



కొల్లేరు ఆక్రమణలే ముంపు సమస్యకు ప్రధాన కారణం. తిలాపాపం తలాపిడికెడు అనేలా అటవీశాఖ అధికారులు రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అభయారణ్యంలో అక్రమిత చేపల చెరువులను అడ్డుకోలేకపోతున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఆక్రమణల పర్వం ఆగడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాలతో చేసిన కొల్లేరు ఆపరేషన్ లక్ష్యం నెరవేరలేదు. ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– ఎల్ఎస్ భాస్కరరావు, సామాజిక సేవా కార్యకర్త, మండవల్లి

డ్రెయిన్లకు మరమ్మతులు చేయాలి



కొల్లేరులో డ్రెయిన్లకు పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయాలి. కొల్లేరు ప్రజానీకం స్థానికంగా ఉపాధి కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు. కొల్లేరు ప్రజలను ఆదుకోడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. రెగ్యులేటర్లను నిర్మిస్తే వేసవిలో నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ముంపు నీటితో కొల్లేరు ప్రజలందరం ఇబ్బందులు పడుతున్నాం.

– ఊడుమూడి వెంకటరామరాజు, గోకర్ణపురం, కైకలూరు మండలం

క్లుప్తంగా

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

ఉంగుటూరు: మోటారు సైకిల్ నుంచి పడి బాదరాల సువార్తవాణి(49) మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. తాడేపల్లిగూడెంకు చెందిన సువార్త వాణి, కుమార్తె అమూల్య ద్విచక్రవాహనంపై నల్లజర్ల మండలం ఆవుపాడు చర్చికి వెళ్ళారు. అక్కడ పనులు పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణంలో ఉంగుటూరు దాటాక వెల్లమిల్లి రేవు సమీపంలో జాతీయరహదారిపై బైక్ పడిపోయింది. తీవ్రగాయాలైన సువార్త వాణిని తాడేపల్లిగూడెం ఆ తరువాత ఏలూరుకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందిన . భర్త ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాల సంఘాల ఐకాస కన్వీనర్‌గా రవిదేవా


తిర్రే రవిదేవా

తణుకు: మాల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కన్వీనర్‌గా తణుకు పట్టణానికి చెందిన తిర్రే రవిదేవా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మాల సంఘాల నాయకుల సమావేశానికి రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వివిధ మాల సంఘాల నాయకులు హాజరై ఐక్య కార్యాచరణ సమితిగా ఏర్పడ్డారు. ఈ సమావేశంలో మాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు తిర్రే రవిదేవాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్కూటీల దహనం కేసులో ముగ్గురి అరెస్టు

తణుకు: తణుకు మండలం వేల్పూరులో రెండు స్కూటీల దహనం ఘటనలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు. గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ రెడ్డి నరేంద్రప్రసాద్‌కు చెందిన మోటారు సైకిళ్లను ఈ నెల 10 అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా వీరభద్రపురం గ్రామానికి చెందిన గాలింకి ఆనంద్‌కుమార్, వెంకట్రాయపురం గ్రామానికి చెందిన గారపాటి జయ సూర్యచంద్ర, వేల్పూరు గ్రామానికి చెందిన పల్లేటి రాజేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసాపురం: నరసాపురం–పాలకొల్లు రూట్‌లో లాకు దిగువన 213 జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతానికి చెందిన గునిశెట్టి నాగులు(35) అక్కడిక్కడే మృతి చెందాడు. అతను జేసీబీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఎస్సై జయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 11.30 సమయంలో బైక్‌పై పాలకొల్లు నుంచి నరసాపురం వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ కింద పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లడంతో పోలీసులు విచారించి పాలకొల్లులో అదుపులోకి తీసుకున్నారు.


బొజ్జ గణపయ్య.. వెళ్లిరావయ్య!


చింతలపూడి: పట్టణంలో ఊరేగుతున్న వెలమపేట వినాయకుడు

గణపతి నవరాత్రులు ముగియడంతో తొమ్మిది రోజుల పాటు పూజలందుకొన్న గణనాథుడికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అంగరంగ వైభవంగా నిమజ్జనం నిర్వహించారు. భారీ డీజేతో, యువత కేరింతల మధ్య నిమజ్జనం అట్టహాసంగా సాగింది. శక్తి వేషాలు, కోలాటాలు, చిన్నారుల కర్రసాము, కేరళ వాయిద్యాల నడుమ గణేశుడ్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి తీసుకెళ్లే వాహనాన్ని అందంగా అలంకరించి ఊరేగించారు. **–సాక్షి నెట్‌వర్క్**


జగన్నాథపురంలో ఇలా....


ఏలూరు తూర్పులాకుల వద్ద వినాయకుడి నిమజ్జనం


ఏలూరు: నిమజ్జనానికి వెళ్తున్న కూరగాయల వర్తక సంఘం ఏర్పాటు చేసిన వినాయకుడు


ఏలూరు: నిమజ్జనానికి వెళ్తున్న రామకోటిలో ఏర్పాటు చేసిన వినాయకుడు


భీమడోలు: ఆకట్టుకున్న విచిత్ర శక్తి వేషాలు


తణుకు: ప్రత్యేక రథంపై నిమజ్జనానికి శ్రీవరసిద్ధి వినాయక స్వామి


తణుకు: కేరళ డప్పు వాద్యాల మధ్య నృత్యం చేస్తున్న కళాకారులు


ద్వారకాతిరుమల: హైస్కూల్ వద్ద నెలకొల్పిన వినాయకుడి ఊరేగింపు


పెనుగొండ: మండలంలోని బూరుగులంకలో కోలాటం


జంగారెడ్డిగూడెం: నిమజ్జనానికి గణేశుడి ఊరేగింపు

చినతాడేపల్లి రామాలయంలో చోరీ


గ్రామ శివారులో పారేసిన హుండీ

తాడేపల్లిగూడెం రూరల్: ఆలయంలోకి ప్రవేశించి హుండీలోని నగదును కాజేసిన సంఘటన మండలంలోని చినతాడేపల్లి రామాలయంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని రామాలయంలో ఆదివారం రాత్రి 11 నుంచి 12 గంటల మధ్య ఈ చోరీ జరిగినట్లు తెలుస్తోంది. ఆలయానికి ఉన్న తాళాన్ని కోసి, హుండీని చోరీ చేశారు. అనంతరం హుండీలోని నగదును కాజేసి, గ్రామ శివారులో పారేశారు. గ్రామస్తుల సమాచారంతో తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కోడి వ్యర్థాల వ్యాన్ సీజ్


అంబర్‌పేట వద్ద వ్యాన్ స్వాధీనం చేసుకున్న ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: అంబర్‌పేట వద్ద సోమవారం కోడి మాంస వ్యర్థాల అక్రమ రవాణా చేస్తున్న వ్యాన్‌తో పాటు నాలుగు టన్నుల వ్యర్థాలను సీజ్ చేసారు. వ్యాన్ డ్రైవర్, అతనితో పాటు ముగ్గురు వ్యక్తులపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. దాడుల్లో విజయవాడలో కమ్మిలి సాంబశివరావుకు చెందిన మహేంద్రా బోలెరో వ్యాన్‌లో నాలుగు టన్నుల కోడి వ్యర్థాలను తరలిస్తుండగా అంబర్‌పేట వద్ద అధికారులు పట్టుకున్నారు. వాహన యాజమాని కె.సాంబశివరావు, చెర్వు యాజమాని ముంగర వినాయక, వారికి మధ్యవర్తిగా ఉన్న తోకలపల్లికి చెందిన భలే వెంకట సుబ్బరాజు, వాహన డ్రైవర్‌పై ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామారావు నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కొయ్యలగూడెం: మండలంలోని ఆరిపాటి దిబ్బల వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. కేతవరం గ్రామానికి చెందిన గొంద్రాల నాగ వెంకట రామారావు, తన తండ్రి, కుటుంబసభ్యులతో కలిసి సోమవారం కారులో దూబచర్ల వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆరిపాటి దిబ్బలు ప్రాంతానికి వచ్చేసరికి కారు డ్రైవింగ్ చేస్తున్న రామారావు తండ్రి గొంద్రాల వెంకటేశ్వరరావు నిద్రమత్తులో కారును అదుపుచేయలేక చెట్టును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా, రామారావు కాలు విరిగింది. వెనుక ఉన్న రామారావు భార్య, పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదు. చుట్టుపక్కల వారు చూసి వెంటనే ఆటోలో కొయ్యలగూడెం ఆసుపత్రికి తరలించారు. మధ్యలో వెంకటేశ్వరరావు మృతిచెందాడు. రామారావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆల్బెండజోల్‌తో నులిమేద్దాం

నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

గణపవరం: జాతీయ నులిపురుగల నివారణ వారోత్సవాలలో భాగంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని వైద్య ఆరోగ్యశాఖ చేపట్టింది. ఈనెల 17న 1 నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారందరికీ ఈ మాత్రలు వేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఈ మాత్రలను వేయించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు. వైద్యసిబ్బందితో పాటు గ్రామ స్థాయిలో ఉన్న ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాఠశాలల్లో ఈ మాత్రలను వేయనున్నారు. మంగళవారం మాత్రలు వేసుకోని వారికి ప్రత్యేకంగా 18న మాత్రలు వేయించేలా ఏర్పాట్లు చేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో ఉన్న 7 పీహెచ్‌సీల పరిధిలోని అన్ని ప్రాఠశాలల్లోని సుమారు 20 వేల మంది విద్యార్థులకు ఈ మాత్రలు వేయడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నులిపురుగుల వ్యాప్తి ఎలా?

- అపరిశుభ్రత కారణంగానే నులిపురుగులు వ్యాప్తి చెందుతాయి.
- చేతి గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించకపోవడం వల్ల గోళ్లలో మట్టి చేరి అనారోగ్యానికి కారణమవుతుంది.
- బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన వల్ల నులిపురుగులు శరీరంలోకి చేరతాయి.
- భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడంవల్ల కూడా అనారోగ్యానికి కారణమవుతుంది.


పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది(ఫైల్)

నులి పురుగులతో వచ్చే సమస్యలు

- నులి పురుగుల వల్ల పిల్లల్లో అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి.
- పేగుల నుంచి పోషకాలను గ్రహించి శరీరంలో నులిపురుగులు అభివృద్ధి చెందుతాయి.
- దీనివల్ల శరీరంలో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఆల్బెండజోల్‌తో చెక్

- ఏలికపాములు, నులిపురుగులు, కొంకి పురుగులు పిల్లల కడుపులో ఉంటాయి. వీటినిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయి.
- రెండు నుంచి 19 ఏళ్ల వయస్సుగల వారు 400 ఎంజి టాబ్లెట్, రెండేళ్ల లోపు వయస్సు ఉన్నవారికి అందులో సగం టాబ్లెట్ వేయాలి.
- మధ్యాహ్నం భోజనం తర్వాత వేసుకోవాలి.

ఏర్పాట్లు పూర్తి చేశాం



పిల్లల్లో నులిపురుగుల కారణంగా పోషకాహార లోపం, రక్తహీనత వస్తుంది. శారీరక, మానసిక ఎదుగుదల లోపిస్తుంది. చదువులో బాగా వెనుకబడి పోతారు. ఆరోగ్యవంతమైన పిల్లలకోసం ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రను పిల్లలకు వేయించాలి. గణపవరం మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో పాటు బయట ఉన్న పిల్లలకు ఈ మాత్రలు వేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం.

డా.సంతోష్‌నాయుడు, వైద్యాధికారి, గణపవరం పీహెచ్‌సీ

బైక్ దొంగల అరెస్టు

పెంటపాడు: పలు ప్రాంతాల్లో మోటార్‌సైకిళ్లు, కోళ్ల దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు సభ్యులను మంగళవారం పెంటపాడు పోలీసులు అరెస్టు చేసారు. ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 14న చిలకంపాడు లాకుల వద్ద రాంబాబు ఇంట్లో బైక్, 8 కోళ్లు అపహరణకు గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.80 వేలు. గత రెండు రోజులుగా పెంటపాడు సెంటర్‌లో పోలీసుల తనిఖీలలో భాగంగా అనుమానంగా ఉన్న గూడెం యాగర్లపల్లికి చెందిన మంగి కోటయ్య, యరసాని నాగరాజు, ఉయ్యాల నాగరాజును విచారించి సోదాలు చేయగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. చివరకు వారి నుంచి నిజాలు రాబట్టారు. లాకుల వద్ద చోరీకి గురైన మోటార్‌సైకిల్, కోళ్లను స్వాధీనం చేసుకొన్నారు. వారిని మంగళవారం అరెస్టు చేసి గూడెం కోర్టుకు పంపగా.. కోర్టు వారికి 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై స్వామి తెలిపారు.

హైడ్రాలిక్ మిషన్‌లో పడి కూలీ మృతి

ఏలూరు టౌన్: ఆశ్రం హాస్పటల్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన శ్రీ విజయదుర్గా ట్రేడర్స్ పేరుతో పాత ప్లాస్టిక్, ఇనుప సామాన్లు ఎగుమతి చేసే కంపెనీ నిర్వహిస్తున్నారు. ఈ కంపెనీలో బీహార్‌కు చెందిన ఏడుగురు వ్యక్తులు పనిచేస్తుండగా.. ఈ నెల 15న రాత్రి హైడ్రాలిక్ మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తోన్న వుల్సర్ శర్మ (35) కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిషన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాల మధ్య రక్తం కారుతూ కనిపించడంతో సోమవారం ఉదయం మిషన్‌లోని పాత సామాన్లను తొలగించి చూడగా శర్మ మృతదేహం లభించింది. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే దీనిని పోలీసులు ఆత్మహత్యగా భావించడంపై అనుమానాలు వస్తున్నాయి. ఏం జరిగిందనే విషయంపై పూర్తి విచారణ చేయాల్సిన పోలీసులు ఆత్మహత్యగా ముందుగానే భావించడం వెనుక ఉద్దేశమేంటనేది సందేహంగా మారింది.

బాలకృష్ణ శర్మకు పురస్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితుడు గుడిమెట్ల బాలకృష్ణ కిషోర్ శర్మకు కాశీ జ్యోతిష్య సంస్థానం, ప్రాచీన జ్యోతిష్య గణిత శాస్త్ర నిపుణుల సంఘం సంయుక్తంగా కాశీ జ్యోతిష్య ప్రభాకర పురస్కారం అందచేసింది. ఈ నెల 14 నుంచి వారణాసిలో నిర్వహించిన ఆయుర్ జ్యోతిష విజ్ఞాన సభలో ఆయన ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొన్నారు. జ్యోతిష్యంపై చేసిన ఉపన్యాసం సభికులను ఆకట్టుకుంది. తనకు అందించిన పురస్కారాన్ని బాలకృష్ణ శర్మ తన తల్లికి అంకితమిచ్చారు.


కాశీ జ్యోతిష ప్రభాకర పురస్కారాన్ని తల్లి స్వాహా దేవికి అంకితమిస్తున్న బాలకృష్ణ కిశోర్ శర్మ

క్లుప్తంగా

ఎయిర్ స్ట్రిప్ వాకర్స్‌కు అభినందనలు



పాలకొల్లులో అభినందన సభలో ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాలకొల్లులో సోమవారం నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా కేబినెట్ సమావేశంలో తాడేపల్లిగూడెం ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఇంటర్నేషనల్ వాకర్స్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వి.మురళీమోహన్‌రావు, జిల్లా గవర్నర్ వి.సత్యనారాయణ, వాకర్స్ అధ్యక్షులు దూలం నాగరాజు, కోపల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు రావిపాడులో ప్రత్యేక పూజలు

పెంటపాడు: రావిపాడు గ్రామంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈనెల 17న సాయంత్రం భాద్రపద పౌర్ణమి పురస్కరించుకొని పూర్ణహారతి కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. మహిళలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

విజయవాడలో దుప్పట్ల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలో ఇటీవల వరదల వల్ల నష్టపోయిన సింగ్ నగర్‌లో స్థానిక ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శానం లలిత, మహిళా సభ్యులు యెగ్గిన పార్వతి, లక్ష్మి వారి సొంత ఖర్చులతో సోమవారం విజయవాడ వెళ్లి బాధితులకు దుప్పట్లు అందజేశారు. మహిళలను పలువురు అభినందించారు.

పంటు రాకపోకల పునరుద్ధరణ

నరసాపురం: వశిష్ట గోదావరి ప్రవాహ ఉధ్మతి తగ్గడంతో సోమవారం నుంచి పట్టణంలోని గోదావరి పడవల రేవులో పంటు రాకపోకలు పునరుద్ధరించారు. గోదావరి వరద కారణంగా వారం రోజులుగా పంటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తిరిగి పంటు రాకపోకలు ప్రారంభం కావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హి సేవ

నరసాపురం రూరల్: పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. మంగళవారం సీతారామపురం సౌత్ గ్రామంలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామన్నారు. గ్రామాల పరిశుభ్రత, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి అక్టోబర్ 2 వరకు పర్యావరణ పరిశుభ్రత కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీవో వి.బాబ్జిరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 17 మంగళవారం నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టబోయే కార్యక్రమాల్లో భాగంగా ప్రతీ గ్రామంలోనూ స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టడం, చెత్త చెదారాలను లేకుండా చేయడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం తదితర కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను, గ్రామస్తులను భాగస్వాములు చేయడం, పారిశుద్ధ్య కార్మికుల సహకారాన్ని గుర్తించడం ద్వారా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వరద పోయింది.. బురద మిగిలింది

నరసాపురం: వశిష్ట గోదావరి నీటిమట్టం సాధారణ స్థితికి చేరుకుంది. స్థానికంగా గోదావరి పూర్తిగా ప్రవాహ వేగం తగ్గింది. గోదావరి శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ పరిధిలో గోదావరి తీరం వెంబడి ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో ముంపు పూర్తిగా తగ్గింది. అయితే రేవులన్నీ బురదమయంగా మారాయి. వలంధర్‌రేవు వద్ద భక్తులు స్నానాలు చేయడానికి అనుమతి ఇచ్చారు. కానీ వలంధర్‌రేవు నీరు తొలగడంతో బురదమయంగా మారింది. నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలు కూడా అలాగే ఉన్నాయి. అమరేశ్వరఘాట్, లలితాంబ ఘాట్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పాలకొల్లు అర్బన్: పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రోత్సహకాలు అందించారు. పట్టణంలో శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రూ.1000 నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం, దుస్తులు అందజేశారు. అలాగే యాదవ ఎడ్యుకేషన్ సొసైటీ కన్వీనర్ ఆవాల పెద్దిరాజు లైబ్రరీ సైన్స్‌లో డాక్టరేట్ సాధించిన సందర్భంగా కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

వరిపై ఎండాకు తెగులు ఉధృతి

- దిగుబడులపై ప్రభావం చూపుతుందంటున్న రైతులు
- ఎకరాకు 10 బస్తాల వరకు దిగుబడి తగ్గుతుందని ఆవేదన
- ఎరువులు అధిక వినియోగం వల్ల తెగుళ్లు



మోదుగగుంటలో వరిని ఆశించిన ఎండాకు తెగులు

తాడేపల్లిగూడెం రూరల్: అన్నదాతలను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు అధిక వర్షాలు ఇబ్బందులకు గురి చేశాయి. దీంతో వరి నాట్లను ఎలా కాపాడుకోవాలని తాపత్రయ పడ్డారు. తీరా వర్షాలు తగ్గుముఖం పట్టి ఎండలు కాస్తున్న తరుణంలో తాడేపల్లిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ఎండాకు తెగులు కనిపిస్తోంది. ప్రధానంగా ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, మోదుగగుంట, తాళ్లపాలెం, ఉప్పరగూడెం, దండగర్ర, కడియద్ద, కొమ్ముగూడెం తదితర గ్రామాల్లో ఎండాకు తెగులు ఉధృతి కనిపిస్తోంది. పంట చేతికొస్తున్న తరుణంలో ఎండాకు తెగులు రావడంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి 10 బస్తాల వరకు దిగుబడులు తగ్గుతాయని వాపోతున్నారు. ఖరీఫ్‌లో వర్షాల కారణంగా దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తాయని, దీనికి తోడు ఎండాకు తెగులు ప్రభావంతో మరింత తగ్గే అవకాశం ఉందంటున్నారు.

దిగుబడి తగ్గే అవకాశం



పదెకరాల విస్తీర్ణంలో కౌలు సేద్యం చేస్తున్నాను. చాలా వరకు వరి గింజ కట్టే దశలో ఎండాకు తెగులు వ్యాపించింది. దీనివల్ల తప్ప శాతం ఎక్కువగా ఉంటుంది. ఎకరానికి 10 బస్తాల వరకు దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. వర్షాలకు తోడు ఎండాకు తెగులు కారణంగా దిగుబడులు తగ్గడంలో రైతుకు వచ్చేది అంతంత మాత్రమే.

– ములగాల గంగారావు, కౌలు రైతు, దండగర్ర, తాడేపల్లిగూడెం మండలం

తెగులు నివారణ చర్యలు చేపట్టాలి



ఇటీవల కురిసిన వర్షాలకు అధికంగా ఎరువుల వినియోగం వల్ల ఎండాకు తెగులు వ్యాపిస్తోంది. ఎండాకు తెగులు వల్ల ఎకరానికి సుమారు రెండు బస్తాలు మాత్రమే దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. దీని నివారణకు లీటరు నీటికి ప్లాంటామైసిన్ రెండు ప్యాకెట్లు, కోసైడ్ రెండు గ్రాములు మందు కలిపి పిచికారీ చేసుకోవాలి. ఎకరానికి రమారమీ పది లీటర్ల వరకు పిచికారీ చేసుకోవాలి.

– ఆర్ఎస్. ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

ఆర్టీసీ డిపోకు డస్ట్‌బిన్ల అందజేత



డస్ట్‌బిన్లు అందించిన రాజేష్‌ను అభినందిస్తున్న మేనేజర్ గిరిధర్ కుమార్

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం దాతల ఔదార్యం అభినందనీయమని ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతే సేవా పక్షోత్సవాల్లో భాగంగా తణుకు రాజేష్ డయాబెటీస్ ఎండోక్‌లెరైన్ సెంటర్ డాక్టర్ రాజేష్ సౌజన్యంతో 12 డస్ట్ బిన్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా డిపో, కార్గో సిబ్బందిచే స్వచ్ఛతే సేవా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆస్పత్రి పీఆర్వో వట్టిపులుసు మణికంఠ, డీపీటీఓ ఆఫీస్ ఎస్‌టీఐ రామాని బాలసుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌-2 బొబ్బా వెంకట కృష్ణారావు, యూనియన్ నాయకులు తగరంపూడి వెంకట శ్రీనివాస్, ములగాల వెంకటరత్నం, బయ్యే వెంకట నాగ సుబ్బారావు, సరిదే ఏసుబాబు, కోరాడ దుర్గాప్రసాద్, డీఎంఈ షేక్ లాల్ పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం



తణుకులో ఓజోన్ పరిరక్షణ దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్లో సోమవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి మాట్లాడుతూ ఓజోన్ పొర చాలా ప్రాముఖ్యమైనదని, అతిలోహిత కిరణాల తాకిడి నుంచి భూమి మీద పర్యావరణం, జీవరాశులను రక్షిస్తుందని స్పష్టం చేశారు. ఓజోన్‌పొరపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఊరేగింపులు, నిమజ్జనాలు



తణుకు అర్బన్: ఆకర్షణీయంగా శక్తివేషాలు



తాడేపల్లిగూడెం పట్టణం పాతూరులోని వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 12వ వార్డు పాతూరు వినాయకుని ఊరేగింపు మహోత్సవం యూత్ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా సోమవారం రాత్రి నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని ఉంచి చిత్ర విచిత్ర వేషాలు, కాళికా నృత్యాలు, డీజే సౌండ్స్ నడుమ స్వామివారి ఊరేగింపు సాగింది. అనంతరం గోదావరి ఏలూరు కాలువలో గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.



తణుకు : స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



తణుకు అర్బన్: వరసిద్ధి వినాయక స్వామి ఊరేగింపులో ఆకట్టుకున్న శివనాట్యం

వైభవంగా గణనాథుల ఊరేగింపు

తాడేపల్లిగూడెం రూరల్: గణనాథుల ఊరేగింపు, నిమజ్జనోత్సవ కార్యక్రమాలను మండల వ్యాప్తంగా సోమవారం వైభవంగా నిర్వహించారు. జగన్నాథపురం, చినతాడేపల్లి, ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, కొత్తూరు, ఆరుగొలనుతో పాటు తాడేపల్లిగూడెంలోని గణేష్‌నగర్, కోతిబొమ్మ సెంటర్‌లోని గణనాథులను ఊరేగించి, అనంతరం గోదావరి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. చిత్ర, విచిత్ర వేషధారణలు, డీజే సౌండ్స్ నడుమ స్వామివారి విగ్రహ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. దండగర్ర, మోదుగగుంట, ఆరుగొలను గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. చినతాడేపల్లి ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, కేతేపల్లి రామవెంకటసుబ్బారావు, చుక్కా సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టూరి శ్రీకృష్ణుడు, నూలి నాగార్జునరావు, చక్కా బాలాజీ, బోనగిరి రవి, దండగర్ర సర్పంచ్ పిల్లా రాంబాబు, జగన్నాథపురంలో బొల్లిన రామకృష్ణ, కంభంపాటి గంగరాజు, ఉప సర్పంచ్ గూడవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లి గ్రామంలో..



అలంపురంలో వినాయకుని ఊరేగింపు

గంగ చెంతకు గణనాథులు

తణుకు అర్బన్: తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వరసిద్ధి వినాయక ఆలయంలోని స్వామివారి ప్రతిమను నిమజ్జనం చేశారు. దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ముందుగా స్వామివారికి శాస్త్రోక్తకంగా పూజలు చేశారు. అనంతరం స్వామివారి ప్రతిమను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన రథంపై కూర్చుండబెట్టి శివ వేషధారణలో ఉన్న కళాకారులు చేసిన శివతాండం, శివుడి నృత్య సన్నివేశాలు, శక్తివేషాలు, కేరళ డప్పులు, తీన్‌మార్, బ్యాండు మేళం, విచిత్ర వేషధారణలు, దేవతామూర్తుల వేషధారణలు, భారీ బాణసంచా కాల్పుల నడుమ తణుకు రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, నరేంద్ర సెంటర్ మీదుగా భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గోస్తనీ కాలువలో నిమజ్జనం చేశారు. దారిపొడవునా భక్తులు స్వామివారికి హారతులివ్వగా, యువత, భక్తులు ఊరేగింపులో మమేకమయ్యారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొమ్మిరెడ్డి సూరిబాబు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదములు పంపిణీ చేశారు.

ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

తణుకు: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా తణుకు ఏడో వార్డు ఎన్జీవో కాలనీలో వరసిద్ధి వినాయక చవితి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారి లడ్డూలను వేలంపాటలో కొత్తపల్లి రామచంద్రరావు, సూరిబాబు, యాతం సుబ్రహ్మణ్యంలు రూ.32 వేలకు దక్కించుకున్నారు. అనంతరం వినాయకుని ప్రతిమను గోస్తనీ కాల్వలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొత్తపల్లి రామచంద్రరావు, కర్రి శ్రీనివాసరెడ్డి, సూరిబాబు, టీవీ శేఖర్, సుబ్రహ్మణ్యం, మూర్తి, సాంబశివరావు, మంగారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని ఊరేగింపు

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వినాయకుని ఊరేగింపు ఊరేగింపు, నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెంటపాడు శెట్టిబలిజ పేట, వెలంపేట, కాపుల రామాలయం, రెడ్ల వీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేసి, ఊరేగింపు నిర్వహించారు. ప్రత్తిపాడు, విప్పర్రు, కె. పెంటపాడు, ఆకుతీగపాడు, ముదునూరులో బాణసంచా కాలుస్తూ, తీన్‌మార్, శక్తి వేషధారుల నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అలంపురం టీబీఆర్ సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆకర్షణగా కేరళ డప్పుడు, గొడుగులు, విద్యుత్ లైట్లు, విచిత్ర వేషాలతో నిర్వహించిన వినాయక ఊరేగింపు ఆకట్టుకుంది. టీబీఆర్ సంస్థల ఉద్యోగులతో కలిసి చైర్మన్ తనుబుద్ది భోగేశ్వరరావు, రవికిరణ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఊరేగింపు నిర్వహించారు. ఈనెల 18న అలంపురంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు టి.రవికిరణ్ తెలిపారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో ముస్లింల ప్రవిత్రమైన రోజైన మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో మసీదుల గురువులైన ఇమామ్‌లను ప్రత్యేకంగా సన్మానించారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కె. పెంటపాడు జామియా మసీదు, పెంటపాడు పెద్ద మసీదు, సంతమార్కెట్, వల్లూరుపల్లి, మీనవిల్లూరు తదితర గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ పండగ పురస్కరించుకొని మహ్మద్ ప్రవక్త జన్మదినం ఘనంగా జరుపుకున్నారు.

నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం

మొగల్తూరు: నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొగల్తూరు ఆసుపత్రి పరిధిలోని 61 అంగన్‌వాడీ కేంద్రాలు, 68 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కూరగాయల ధరలు పైపైకి


సామాన్యుల విలవిల



తణుకు రైతు బజారులో కూరగాయల దుకాణం

తణుకు టౌన్: నిత్యావసర సరుకులైన కూరగాయల ధరలు రోజు రోజుకు ఆకాశంవైపు చూస్తుండడంతో ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు కూరగాయల పంటలు మునిగాయి. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఏమీ కొనలేని, తినలేని పరిస్థితి ఏర్పడింది. వర్షాకాల ప్రారంభం నుంచే కూరగాయల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. కూరగాయల ధరలన్నీ కిలో రూ.50 నుంచి రూ.60 పై మాటే. గతంలో ఎన్నడూ లేని విధంగా బంగాళా దుంపల ధర కిలో రూ.50కి చేరింది. తణుకు మార్కెట్‌లో కిలో ఉల్లిపాయలు రూ.60 నుంచి 65, పచ్చిమిర్చి రూ.50, క్యాప్సికం రూ.80, బీరకాయలు రూ.60, వంకాయలు రూ.80, టమోటాలు రూ.40, చిక్కుడు కాయలు రూ.50, దొండకాయలు, బెండకాయలు, బీట్ రూట్, క్యారెట్, కీరదోస దోసకాయలు వంటివన్నీ రూ.60ల వరకు విక్రయిస్తున్నారు. మునగ, అరటి, సొర, పొట్లకాయలు ధరలు ఒక్కొక్కటీ రూ.30 కంటే ఎక్కువగానే అమ్ముతున్నారు. వీటి బాటలోనే ఆకు కూరల ధరలు పయనిస్తున్నాయి.


వర్షాలతో పెరిగిన ధరలు



తుఫాన్, భారీ వర్షాల కారణంగా గోదావరి తీరంలో కూరగాయల పంటలుల పూర్తి దెబ్బతిన్నాయి. ఉన్న కూరగాయలకు డిమాండ్ పెరిగింది. మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొంటే గానీ కూరగాయల ధరలు అందుబాటులోకి రావు.

– కొటికలపూడి కృష్ణ, కూరగాయల వ్యాపారి, తణుకు రైతు బజారు

పెరిగిన రవాణా చార్జీలు



తుఫాన్, భారీ వర్షాల కారణంగా మన ప్రాంతంలోని కూరగాయల తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేస్తున్నాం. వీటి రవాణాకు ప్రతి 10 కేజీల కూరగాయలకు రూ.100 నుంచి రూ.150 వరకు చార్జీలు పెరిగిపోయాయి. దీంతో వ్యాపారులకు రవాణా చార్జీలు భారంగా మారాయి.

– బసవా గుబ్బాలు, కూరగాయల వ్యాపారి, తణుకు రైతు బజారు

వైఎస్సార్ సీపీ నేత అశోక్ శ్రీనివాస్‌కు నివాళి



అశోక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న, కారుమూరి నాగేశ్వరరావు, కారుమూరి సునీల్ కుమార్, పార్టీ శ్రేణులు

కామవరపుకోట: మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతి వైఎస్సార్‌సీపీకి, ఈ ప్రాంత ప్రజలకు తీర్చలేనిలోటని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కళ్ళచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అశోక్ శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీకి విధేయుడుగా ఉంటూ, పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారని, ఈ ప్రాంత ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి అన్ని వేళల అందుబాటులో ఉంటూ సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని, అశోక్ వైఎస్సార్‌సీపీకి చేసిన కృషి, ప్రజల కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ వారు విచారం వ్యక్తం చేశారు.

ఎల్బీచర్లలో పోలీస్ పికెట్



మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ దుర్గా ప్రసాద్

నరసాపురం రూరల్: వినాయక నిమజ్జనం సందర్భంగా నరసాపురం మండలం ఎల్బీచర్ల పంచాయతీ బైనపాలెంలో ఆదివారం జరిగిన ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో మూడు పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు సీఐ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వినాయక నిమజ్జనంలో గత రాత్రి బైనపాలెంలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు కానిస్టేబుళ్లకు గాయాలకు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడు పోలీస్ ఫికెట్‌లు, 12 మంది కానిస్టేబుళ్లను బందోబస్తుకు ఏర్పాటు చేశామన్నారు. రెండు వర్గాలకు వారిపై కేసు నమోదు చేశామని, ఘర్షణలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్సై జి.వాసు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ



పశువుల దాణా పంపిణీ చేస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

యలమంచిలి: వరద ప్రభావిత గ్రామలైన కనకాయలంక, పెదలంకల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు సోమవారం 20 టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణా (టీఎంఆర్) పంపిణీ చేశారు. కనకాయలంకలో 117 మంది రైతులకు 480 బస్తాలు (12 టన్నులు), పెదలంకలో 45 మంది రైతులకు 320 బస్తాలు (8 టన్నులు) పంపిణీ చేశారు. కార్యక్రమములో కనకాయలంక పెదలంక సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు పశు సంవర్ధక శాఖ పాలకొల్లు డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ జి.మల్లేశ్వరరావు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి స్థానిక నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, కొడవటి వరబాబు, తదితరులు పాల్గొన్నారు.